


మన

# జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 209 | పేజీలు : 8 | వెల : రూ.2/- | 11-04-2024 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## చంద్రయాన్ 4 పై కీలక అప్‌డేట్ ఇచ్చిన ఇస్రో చీఫ్

## ఈసారి జాబిల్లిపై 100 రోజులు

న్యూ ఢిల్లీ మన జనప్రగతి ఏప్రిల్ 10:- చంద్రయాన్ 1, చంద్రయాన్ 2 ప్రయోగాలు చేపట్టినా.. చంద్రయాన్ 3 ప్రయోగంతోనే భారత్ ఖ్యాతి విశ్వవ్యాప్తం అయింది. ఎందుకంటే ప్రపంచంలో ఏ దేశానికీ వీలు కాని విధంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు పెట్టిన దేశంగా భారత్ నిలవడంతో ఇస్రో సాధించిన ఘనతపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ చంద్రయాన్ సిరీస్‌లో తదుపరి ప్రయోగాన్ని చేపట్టడంపై ఇస్రో శాస్త్రవేత్తలు తలమునకలై ఉన్నారు. ఈసారి జాబిల్లిపై ఏకంగా 100 రోజుల పాటు ఉండేలా చంద్రయాన్ 4 ప్రయోగాన్ని రూపొందిస్తున్నారు. ఇక ఈ చంద్రయాన్ 4 ప్రయోగానికి సంబంధించిన మరిన్ని వివరాలను ఇస్రో చీఫ్ సోమ్‌నాథ్ వెల్లడించారు.ఇక చంద్రుడిపై మరిన్ని పరిశోధనలు నిర్వహించేందుకు జాబిల్లిపైకి చంద్రయాన్ 4 ను పంపించనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ-ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్

2..




## అన్ని దేశాలకు హెచ్చరిక..

## ఇజ్రాయెల్ ప్రధాని

న్యూ ఢిల్లీ మన జనప్రగతి ఏప్రిల్ 10:- గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న వేళ ఆ దేశ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. గాజాతో జరుగుతున్న పోరులో తాము విజయం సాధించడానికి అడుగు దూరంలో ఉన్నామని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో హమాస్ వద్ద ఉన్న బంధీలను విడిచిపెట్టే వరకు సంధి ప్రసక్తే ఉండదని తేల్చి చెప్పారు. కాగా,

2..



## కన్నీటిని దిగమింగుతూ

## కొడుకు శవాన్ని 8 కి.మీ మోసిన తండ్రి

**ఈ పాపం ఎవరిది ?**

విజయవాడ మన జనప్రగతి ఏప్రిల్ 10:- మనిషి రాతియుగం నుండి కంప్యూటర్ యుగానికి చేరుకున్నాడు. ఆకాశంలో చంద్రుడిని ఆశ్యర్యంగా చూసే రోజుల నుండి చంద్రమండలంపై అడుగుపెట్టే స్థాయికి చేరుకున్నాడు. ఇలా అభివృద్ధి వెంటపడుతూ ఓ గొప్ప లక్షణాన్ని వదులుకున్నారు మనుషులు అదే మానవత్వం సాటి మనిషికి సాయం చేసే గుణాన్ని నేటి సమాజం విస్మరించింది. ఎవడు ఏమైపోతే నాకేంటి? నేను హాయిగా వుంటే చాలని చాలామంది అనుకుంటున్నారు. అభివృద్ధి సంగతి దేవుడెరుగు మనిషి మళ్ళీ ఆ అనాగరిక కాలంలోకి వెళ్లిపోయాడా అనేలా నేటి పరిస్థితులు వున్నాయి. మన కళ్ల ముందే అనేక హృదయవిదారక ఘటనలు చోటుచేసుకుంటున్నా కనీస స్పందన కరువయ్యింది. తాజాగా ఆంధ్ర ప్రదేశ్ లో ప్రతిఒక్కరి




మనసును కలచివేసే సంఘటన వెలుగుచూసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పరిధిలోని చినకోనెల గ్రామానికి చెందిన సార కొత్తయ్యది నిరుపేద కుటుంబం. అతడి రెక్కాడితే కాని ఆ కుటుంబం డొక్కాడదు. పేదరికంతో మగ్గిపోతున్న అతడు స్వగ్రామంలో ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్నాడు. ఇలా గుంటూరు జిల్లా కొల్లూరులోని ఓ ఇటుకల బట్టీలో పనికి కుదిరాడు. భార్యా బిడ్డలతో కలిసి అక్కడే నివాసం వుంటున్నాడు
అయితే ఇటీవల కొత్తయ్య

2..

## అప్పుడు ఓడాము..

## ఇప్పుడు గెలవాల్సిందే

విజయవాడ మన జనప్రగతి ఏప్రిల్ 10:- ఎన్నికల్లో గెలుపు కోసం అన్ని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు



పదును పెడుతుంటాయి. ప్రజాకర్షక పథకాలతో మేనిఫెస్టో, ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉన్న అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు,

2..

## కెనడా సర్కారుకు షాకిచ్చిన

## కమిషన్ నివేదిక

న్యూ ఢిల్లీ మన జనప్రగతి ఏప్రిల్ 10:- కెనడా సర్కారుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుందంటూ ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన ఆరోపణలు నిరాధారమని తేలిపోయాయి. ఈ మేరకు ఆ దేశ దర్యాప్తు సంస్థ తేల్చిచెప్పింది. ఈ పరిణామం చెంపదెబ్బ కొట్టినట్టైంది. 2019, 2021 ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని ఆరోపించిన వ్యాఖ్యల్ని కెనడా వెనక్కి తీసుకుంది. తాజా అప్‌డేట్ ప్రకారం విదేశీ జోక్యం కేసుపై అధికారిక దర్యాప్తులో భారతీయుల హస్తం లేదని తోసిపుచ్చింది.
కనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుంటుందంటూ



ఆ దేశ ప్రధాని ట్రూడో చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తాజాగా తేలిపోయాయి. ఈ మేరకు తాజాగా విడుదలైన కమిషన్ నివేదికతో తేటతెల్లమైంది. దీంతో కెనడా సర్కారుకు గట్టి షాకే తగిలింది. ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైనట్లు నివేదికను సమర్పించాయి. భారత్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తున్న ట్రూడో సర్కారుకు ఊహించని దెబ్బగానే చెప్పొచ్చు.భారత్‌పై కెనడా

2..

## నాపై దుష్ప్రచారం చేస్తున్నారు

## సైబర్ క్రైంకు ఫిర్యాదు

విజయవాడ మన జనప్రగతి ఏప్రిల్ 10:- ఏపీలో ఎన్నికల వేళ కూటమిపై కుట్ర జరుగుతోందన్నారు బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి. ముస్లిం రిజర్వేషన్‌లపై తాను మాట్లాడినట్లుగా ఫేక్ వార్తను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ వార్తను నమ్మొద్దని.. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ బీజేపీ నినాదం అన్నారు. అంటే సమాజంలోని అందరినీ కలుపుకొని అందరినీ అభివృద్ధి వైపు నడిపించడమే బీజేపీ అభిమతం అన్నారు. ఇందుకు భిన్నంగా ట్రోల్ అవుతున్న


3..

## భిన్నత్వంలో ఏకత్వం గురించి

## వివరిస్తున్న బీజేపీ పాట

## మోదీ పరివార్ పేరుతో ఆవిష్కరణ

న్యూ ఢిల్లీ మన జనప్రగతి ఏప్రిల్ 10:- యావత్ దేశ ప్రజల మనోభావాలకు అనుగుణంగా, ప్రతి ఒక్కరి మదిని తాకేలా బుధవారం రోజు బీజేపీ ఒక పాటను విడుదల చేసింది. ఈ పాటలో ప్రధాని మోదీ దశాబ్ధకాలంలో తీసుకొచ్చిన అనేక సంస్కరణలు గురించి చక్కగా వివరించింది. అలాగే మోదీ కలలను కాదు.. వాస్తవాన్ని మణిపూసల్లా అల్లారని అందుకే దేశం మరోసారి మోదీ సర్కార్ కావాలని




కోరుకుంటోందని ట్యాగ్ లైన్?ను జోడించారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశం మనది. అందులో అనేక భాషలు మాట్లాడే వారు ఉంటారు. అనేక ఆచార వ్యవహారాలు పాటించే వారు కూడా ఉన్నారు. వివిధ సంస్కృతి, కళలకు నిలయం ఈ దేశం. అలాంటి వసుదైక కుటుంబంలో అందరూ ఒకే మాటపై నిలబడి మోదీని మరోసారి గెలిపించాలని కోరుకుంటున్నారంటూ సందేశాత్మక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పాట 12 రకాల భాషల్లో పాటబడింది. దేశంలోని అన్ని జాతులను, వర్గాలను ఐక్యం చేస్తూ ఒకే వేదికపై తీసుకొచ్చేలా ఈ పాటను చిత్రీకరించారని తెలిపారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
11 -04-2024

# చంద్రయాన్ 4 పై కీలక అప్‌డేట్

వెల్లడించారు. అయితే అంతరిక్షం గురించి పరిశోధనలు చేయడం అనేది నిరంతరం జరిగే ప్రక్రియ అని తెలిపారు. ఇక ఈ అంతరిక్ష రంగంలో భారతదేశం గొప్ప పురోగతి సాధిస్తోందని కొనియాడారు.




పంజాబ్ లుధియానాలోని ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సోమనాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.చంద్రుడిపై తర్వాత ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. చంద్రయాన్ 4 ప్రయోగాన్ని 2040 లో చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రక్రియ ప్రారంభం అయినట్లు తెలిపారు. అంతరిక్ష పరిశోధనతో పాటు వివిధ సాంకేతిక అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు ఇస్రో ప్రయత్నాలు చేస్తోందని వివరించారు.చంద్రయాన్ సిరీస్‌లో తర్వాత చేపట్టబోయే చంద్రయాన్ 4 ప్రయోగం చాలా కీలకమైందని, భిన్నమైందని సోమనాథ్ వెల్లడించారు. ఈ చంద్రయాన్ 4 ప్రయోగంలో భాగంగా చంద్రుడిపైకి ల్యాండర్‌ను పంపించి వాటిని తిరిగి భూమి మీదకు తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా జాబిల్లిపైన ఉండే రాళ్లు, మట్టి నమూనాలను భూమి మీదకు తీసుకురావాలని ఇస్రో భావిస్తోందని వివరించారు. దాదాపు 100 రోజులు చంద్రుడి మీద పరిశోధనలు చేసేలా.. కిలోమీటరు మేర చంద్రుడిపై తిరిగేలా ఆ వ్యోమనౌకను రూపొందించనున్నట్లు సమాచారం.ఇక 2024 కు సంబంధించి 'జాన్ ఎల్ జాక్ స్విగెర్ట్ జూనియర్' అవార్డు.. చంద్రయాన్ 3 శాస్త్రవేత్తల టీమ్‌కు లభించింది. ఇస్రో తరపున అమెరికాలోని హ్యూస్టన్‌లోని భారత కాన్సుల్ జనరల్ మంజునాథ్ ఈ 'జాన్ ఎల్ జాక్ స్విగెర్ట్ జూనియర్' పురస్కారాన్ని అందుకున్నారు. కొలరాడోలో జరిగిన వార్షిక 'స్పేస్ సింపోజియం'లో అవార్డును అందించారు. అంతరిక్ష పరిశోధనల్లో కీలక ముందడుగు వేసినందుకు చంద్రయాన్-3 బృందానికి ఈ అవార్డు దక్కింది.

# అన్ని దేశాలకు హెచ్చరిక..

గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం మొదలై ఆరు నెలలు పూర్తైన నేపథ్యంలో ప్రధాని నెతన్యాహు నేతృత్వంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నెతన్యాహు .. గాజాతో యుద్ధంలో విజయానికి అడుగు దూరంలోనే ఉన్నామన్నారు. ఇప్పటివరకు తాము చెల్లించిన మూల్యం ఎంతో బాధాకరమైంది, విచారకరమైనదని అన్నారు. తాము ఒప్పందానికి సిద్ధమే కానీ లొంగిపోవడం జరగదన్నారు. అంతర్జాతీయంగా తమపై వస్తోన్న ఒత్తిడిని తమపై కాకుండా హమాస్ వైపు మళ్లించాలన్నారు. తద్వారా బందీలు త్వరగా విడుదలయ్యే అవకాశం ఉంటుందన్నారు. తమపై ఎవరు దాడి చేసినా, చేయాలని ప్రయత్నించినా.. వారిపై ప్రతిదాడులు తప్పవన్నారు. ప్రస్తుతం ఇదే కొనసాగుతోందని.. అన్ని వేళలా ఇదే సూత్రాన్ని ఆచరణలో పెడతామని అన్నారు. హమాస్ నిర్మూలనే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇజ్రాయెల్-హమాస్ వరకు పరిమితమైన ఈ యుద్ధం.. ఇరాన్ జోక్యంతో మొత్తం పశ్చిమాసియాకు విస్తరించే ప్రమాదం ఉందని అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు..



కాల్పుల విమరణ ఒప్పందానికి సంబంధించిన చర్చలు అంతర్జాతీయ మధ్యవర్తుల సహకారంతో కైరోలో తిరిగి మొదలవుతాయని భావిస్తోన్న తరుణంలో నెతన్యాహు ఇలా కామెంట్స్ చేయడం ఆందోళన కలిగిస్తోంది.

# ఈ పాపం ఎవరిది ?

చిన్నకొడుకు ఈశ్వరరావు అనారోగ్యం బారినపడ్డారు. మూడేళ్ల ఈ బాలుడి పరిస్థితి రోజురోజుకు మరింత క్షీణించడంతో తల్లిదండ్రులు హాస్పిటల్ కు తరలించారు. అతడికి చికిత్స అందించినా లాభం లేకుండా పోయింది... గత సోమవారం ఈ చిన్నారి బాలుడు ప్రాణాలు విడిచాడు. దీంతో కొత్తయ్య కుటుంబంలో విషాదం నిండింది.



తన కొడుకు అంత్యక్రియలను స్వగ్రామం చినకోనెలలో నిర్వహించాలని తండ్రి కొత్తయ్య భావించాడు. దీంతో ఓ అంబులెన్స్ లో కొడుకు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. కానీ చినకోనెల గ్రామానికి రోడ్డుమార్గం సరిగ్గా లేకపోవడంతో ఆ అంబులెన్స్ డ్రైవర్ బాలుడి మృతదేహాన్ని మార్గమధ్యలోనే దించేసి వెళ్ళిపోయాడు. మరో వాహనంలో తీసుకెళదామన్న రోడ్డు పరిస్థితి దారుణంగా వుండటంతో ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదు దీంతో చేసేదేమిలేక ఆ తండ్రి తన రెండుచేతుల్లోకి కొడుకు మృతదేహాన్ని తీసుకుని నడక ప్రారంభించాడు. కన్నీటిని దిగమింగుకుంటూనే విజయనగరం జిల్లా మెంటాడ మండలం వనిజ గ్రామం నుండి స్వగ్రామం చినకోనెలకు బయలుదేరాడు. ఇలా దాదాపు ఎనిమిది కిలోమీటర్లు కొడుకు మృతదేహాన్ని మోసాడు. మంగళవారం తెల్లవారుజామున ప్రయాణం ప్రారంభించి ఉదయానికి గ్రామానికి చేరుకున్నాడు. ఇలా పుట్టెడు దు:ఖంలోనూ కొడుకు శవాన్ని మోస్తున్న ఆ తండ్రిని చూసి జాలిపడటం తప్ప ఎవరూ ఏం చేయలేని పరిస్థితి. కొత్తయ్య దీన స్థితికి పాలకులే కారణమంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సంఘటన రాష్ట్రంలో పరిస్థితిని, పేదవాడి బ్రతుకుకు అద్దం పడుతోందని అంటున్నారు. ఈ కాలంలో కూడా గ్రామాలకు రోడ్లు లేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఘటనలను చూసయినా పాలకులు మేలుకోవాలని గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


# కెనడా సర్కారుక

ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తొలుత ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ హత్యపై భారత్‌ను నిందించిన ఆ సర్కారు.. అనంతరం కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం చేసుకుందంటూ విచారణ మొదలుపెట్టింది. అయితే ఈ ఆరోపణలు నిరాధారమని తాజాగా ఆ దేశ దర్యాప్తులో వెల్లడైంది. ఎన్నికల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని స్పష్టం చేసింది.కెనడా ఎన్నికల్లో విదేశీ శక్తులు జోక్యం చేసుకున్నాయంటూ అక్కడి విపక్షాలు ఆరోపించాయి. దీంతో ట్రూడో ప్రభుత్వం ఓ స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే ఇటీవల దర్యాప్తులో భారత్ పేరును చేరుస్తూ ట్రూడో సర్కారు తీసుకున్న నిర్ణయంతో.. ఇరు దేశాల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. కెనడా ఆరోపణలను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇతర దేశాల ప్రజాస్వామ్య ప్రక్రియలో జోక్యం చేసుకోవడం భారత్ విధానం కాదని తేల్చి చెప్పింది. ఈ పరిణామాల వేళ దర్యాప్తునకు సంబంధించి కీలక విషయాలు తాజాగా బయటికొచ్చాయి. కెనడా రాజకీయాల్లో భారత్ ఎలాంటి జోక్యం చేసుకోలేదని దర్యాప్తులో తేటతెల్లమైంది. 2021 నాటి ఎన్నికలను ప్రభావితం చేసేలా భారత్ ప్రయత్నాలు చేసినట్లు తమ దృష్టికి రాలేదని ఆ ఎన్నికలను పర్యవేక్షించిన సీనియర్ అధికారి కమిషన్‌కు వెల్లడించారు. అందుకు ఎలాంటి సాక్ష్యాలు లేవని సదరు అధికారి చెప్పినట్లు తెలిపింది. ఈ వ్యవహారానికి సంబంధించి దర్యాప్తు కమిషన్ ఎదుట జస్టిన్ ట్రూడో బుధవారం వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2019, 2021లో కెనడాలో జరిగిన జాతీయ ఎన్నికల్లో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీ విజయం సాధించింది. అయితే ఆ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చైనా యత్నించిందంటూ మీడియా కథనాలు వెలువడ్డాయి. దీంతో గతేడాది సెప్టెంబరులో ఈ కమిషన్ దర్యాప్తు చేపట్టింది. కాగా ఆ ఎన్నికల్లో చైనా జోక్యం నిజమేనని కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ నివేదిక వెల్లడించింది.



# అప్పుడు ఓడాము.. ఇప్పుడు గెలవాల్సిందే

క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం, అధికారంలో ఉన్న పార్టీలైతే తాము చేసిన పనుల గురించి గొప్పగా ప్రచారం చేసుకోవడం, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం.. ఇలా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు అనేక రకాలుగా వ్యూహప్రతివ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (%దీజీూ%) వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధించడంతో పాటు గతం కంటే ఈసారి మరిన్ని ఎక్కువ సీట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది.ఇందుకోసం అనుసరిస్తున్న అనేక వ్యూహాల్లో అభ్యర్థులను అందరి కంటే ముందే ప్రకటించడం ఒకటి. అభ్యర్థులకు ప్రచారం చేసుకోడానికి ఎక్కువ సమయాన్ని అందించే ఈ వ్యూహం గత ఏడాది చివర్లో జరిగిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సత్ఫలితాలనిచ్చింది. తాము ఇంతవరకు గెలవని స్థానాలతో పాటు, వరుసగా ఓడిపోతూ వస్తున్న స్థానాల్లో ఈసారి గెలుపొందగల్గింది. సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈ వ్యూహాన్ని అనుసరిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం తేదీలను ప్రకటించేలోగానే సగానికి పైగా స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థుల కంటే ముందంజలో ఉంది. అయితే కమలదళం ఇంతటితో సరిపెట్టలేదు.. తాము నిర్దేశించుకున్న 370 సీట్ల లక్ష్యాన్ని అందుకోడానికి గత ఎన్నికల్లో ఓడిన స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పదునైన వ్యూహాలతో ముందుకెళ్తోంది.గతంలో ఓడిన స్థానాలపై ఫోకస్.. లోక్‌సభలో 543 స్థానాలున్నప్పటికీ 2019 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 436 స్థానాల్లో మాత్రమే పోటీ చేయగా, మిగతా స్థానాలను తమ మిత్రపక్షాలకు వదిలేసింది. తాను పోటీ చేసిన స్థానాల్లో 303 గెలుపొందగా, 133 చోట్ల ఓటమి పాలైంది. 2014 సార్వత్రిక ఎన్నికల స్కోరు కంటే సొంతంగానే మరింత సంఖ్యాబలం పెరిగినప్పటికీ.. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి కొన్ని రాష్ట్రాల్లో ఖాతాయే తెరవలేకపోవడం, కొన్ని చోట్ల డిపాజిట్లు కూడా దక్కనంత ఘోర పరాజయం పాలవడం ఆ పార్టీ జీర్ణించుకోలేపోయింది. ఏ రాజకీయ పార్టీ అయినా తాము పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలవాలని కోరుకుంటుంది.



లేదంటే కనీసం గట్టి పోటీనైనా ఇవ్వాలని చూస్తుంది.కానీ బీజేపీ ఉత్తరాదిన ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపొంది, మరికొన్ని రాష్ట్రాల్లో 80-90 శాతానికి పైగా సీట్లను కైవసం చేసుకున్నప్పటికీ, దక్షిణాదిన కర్ణాటక మినహా మిగతా రాష్ట్రాల్లో సాధించిన ఫలితాలు తీవ్ర నిరాశకు గురిచేశాయి. అందుకే తమ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (%చీణూ%)ను విస్తరించి, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కొత్త పొత్తులతో ముందుకెళ్తూ కూటమి స్కోరు పెంచుకునే ప్రయత్నం ఓవైపు చేస్తోంది. మరోవైపు తాము సొంతంగా పోటీ చేస్తున్న స్థానాల్లో గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. ఆ క్రమంలో 2019 ఎన్నికల్లో ఓటమిపాలైన 133 సీట్లలో ద్వితీయస్థానంలో నిలిచి ఓడిన 72 సీట్లను వేరు చేసింది. ఇక్కడ మరింత శ్రమిస్తే వాటిలో కనీసం సగం సీట్లు గెలిచినా తమ స్కోరు మెరుగుపడుతుందని భావిస్తోంది.బీజేపీ ద్వితీయస్థానంలో నిలిచి ఓడిన 72 సీట్లలో 37 స్థానాల్లో ఆ పార్టీ చరిత్రలో ఇంతవరకు ఒక్కసారి కూడా గెలుపొందలేదు. మిగతా 35 స్థానాల్లో గతంలో గెలుపొందిన సందర్భాలున్నాయి. అలాగే ఓటమి మార్జిన్ (అంతరం) ప్రకారం వర్గీకరిస్తే.. 10 వేల ఓట్ల తేడాతో ఓడినవి 6 స్థానాలుండగా, 10 %--% 50 వేల ఓట్ల తేడాతో ఓడినవి 10 స్థానాలున్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని ఆరాంబాగ్‌లో కేవలం 1,142 ఓట్ల తేడాతో బీజేపీ ఓటమి పాలైంది. అండమాన్ నికోబార్ స్థానంలో 1,407 ఓట్ల తేడాతో ఓడిపోగా, ఉత్తర్‌ప్రదేశ్ శ్రావస్తిలో 5,320 ఓట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇలా 10 వేల లోపు ఓట్ల తేడాతో ఓడిపోయిన ఇతర స్థానాల్లో మాల్దా దక్షిణ్ (బెంగాల్), దాద్రానగర్ హవేలి, దక్షిణ గోవా ఉన్నాయి. ఓవరాల్‌గా 50 వేల కంటే తక్కువ ఓట్ల తేడాతో ఓడినవి 16 స్థానాలుండగా, 50 వేల నుంచి 1 లక్ష ఓట్ల తేడాతో ఓడినవి మరో 19 స్థానాలున్నాయి. ఈ రెండు కేటగిరీలు కలిపితే మొత్తం 35 స్థానాలు. వీటితో పాటు లక్ష నుంచి 2 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయిన మరో 22 స్థానాలపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయడం ద్వారా ఈసారి గెలుపొందడానికి ఆస్కారం ఉందని బీజేపీ అగ్రనాయకత్వం అంచనా వేస్తోంది. రాష్ట్రాలవారీగా బీజేపీ ద్వితీయ స్థానంలో నిలిచి ఓడినవాటిలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 22 ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తర్‌ప్రదేశ్ (15), ఒడిశా (11), తమిళనాడు (5), తెలంగాణ (3) చూస్తోంది. ఇక్కడ గత ఎన్నికల్లో అసద్ గెలిచిన మార్జిన్ 2.82 లక్షలు. ఇంత భారీ వ్యత్యాసాన్ని పూడ్చడం అంత సులభమేమీ కాకపోయినా.. బీజేపీ గెలుపు కోసం గట్టిగానే ప్రయత్నాలు సాగిస్తోంది.

# సైబర్ క్రైంకు ఫిర్యాదు



ఫేక్ వార్తను నమ్మొద్దని ముస్లిం సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. రాజమండ్రి లోక్‌సభ ఎన్నికల్లో పురందేశ్వరికి లభిస్తున్న ప్రజాదరణ చూసి, ఓర్వలేక వైఎస్సార్‌సీపీ పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో ఆమె అనని వ్యాఖ్యలను అన్నట్లు ప్రచారం చేస్తున్నారని బీజేపీ నేత లంకా దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పదేపదే ఫేక్ న్యూస్ సృష్టించి అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లంకా దినకర్ ఈసీకి విజ్ఞప్తిచేశారు. ప్రతిసారి ఎన్నికలు రాగానే రిజర్వేషన్ల అంశం తెరపైకి వస్తుందని.. నకిలీ వార్తలపై సైబర్ క్రైంకు ఫిర్యాదు చేస్తామన్నారు మరో నేత. వైఎస్సార్ ప్రభుత్వం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు అన్యాయంగా కట్టబెట్టిందని పురందేశ్వరి ఆరోపించినట్లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. కూటమి గెలిచిన వెంటనే ఆ రిజర్వేషన్ల రద్దుపై తొలి సంతకం చేసేందుకు చంద్రబాబు, పవన్ సానుకూలంగా స్పందించారని పురందేశ్వరి ప్రకటించినట్లు ఇతర వెబ్‌సైట్ల లోగోలతో వైరల్ చేశారు. దీంతో బీజేపీ స్పందించింది.

# ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ టికెట్ రేవంత్ సన్నిహితుడికేనా

ఖమ్మం మన జనప్రగతి ఏప్రిల్ 10:- తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. బలమైన అభ్యర్థులను బరిలోకి దింపుతున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు ఒకటి రెండు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ మినహా మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అయితే కీలకమైన ఖమ్మం స్థానంలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ స్థానానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి నందినితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ప్రసాద్ రెడ్డి, మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తనయుడు యుగంధర్ పోటీ పడుతున్నారు. ఈ ముగ్గురూ కాకుండా తాజాగా మరో కొత్త పేరు తెరపైకి వచ్చింది.నిజామాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత మండవ వెంకటేశ్వరరావు పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాలో ఇద్దరు కీలక నేతలకు చెక్ పెట్టేలా స్థానికేతరుడైన మండవను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. ఖమ్మం జిల్లాలో ఖమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా ఉంటారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ నేత, రేవంత్ రెడ్డికి సన్నిహతుడైన మండవను రంగంలోకి దించున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ నిర్ణయంపై రాజకీయ విశ్లేషకులు భిన్నంగా స్పందిస్తున్నారు. ఇది సరైన నిర్ణయమని కొందరు అంటుండగా.. స్థానికేతరుడైన మండవను రంగంలోకి దించితే కాంగ్రెస్ సెల్ఫ్ గోల్ చేసుకున్నట్లేనని అంటున్నారు.కాగా, గతంలో మండవ టీడీపీలో పని చేశారు. నిజామాబాద్ రూరల్ నాటి డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ హయంలో మంత్రి పదవులు కూడా చేపట్టారు. చంద్రబాబుకు నమ్మకమైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. రేవంత్, మండవ ఇద్దరూ కలిసి కొంత కాలం టీడీపీలో పని చేసారు. ఆ తర్వాత మండవ బీఆర్ఎస్ పార్టీలో చేరగా.. రేవంత్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. 2023 ఎన్నికల ముందు మండవ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా.. ఆయన్న ఖమ్మం ఎంపీగా బరిలోకి దింపేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ విషయంపై క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# హైదరాబాద్‌లో రంజాన్ ప్రత్యేక ప్రార్ధనలు
## ఈ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు,

హైదారాబాద్ మన జనప్రగతి ఏప్రిల్ 10:- రంజాన్ పండుగ సందర్భంగా నేడు హైదరాబాద్ నగరంలో పోలీసు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముస్లింపు పెద్ద ఎత్తున ప్రత్యేక పార్థనల్లో పాల్గొనున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సిటీ పోలీసు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు మీరాలం ట్యాంక్ ఈద్గా, హాకీ గ్రౌండ్, మాసబ్‌ట్యాంక్ పరిసరాలలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని సూచించారు.ఆంక్షలు ఈ రూట్లలోనే..మీరాలం ఈద్గా ప్రార్థనలకు వచ్చే వారి వాహనాలను పురానాపూల్, కామాటిపుర, కిషన్‌బాగ్, బహదూర్‌పురా ఎక్స్ రోడ్స్ నుంచి అనుమతిస్తారు. నిర్దేశిత సమయంలో సాధారణ వాహనదారులను బహదూర్‌పురా ఎక్స్‌రోడ్స్ నుంచి ఈద్గా వైపు అనుమతి ఉండదు. ఈ వాహనాలను బహదూర్‌పురా క్రాస్ రోడ్డు వద్ద కిషన్‌బాగ్, కామాటిపుర వైపు డైవర్ట్ చేస్తారు.శివరాంపల్లి, దానమ్మ హాట్స్ నుంచి ఈద్గా వైపు వచ్చే వాహనాలను దానమ్మ హాట్స్ చౌరస్తా నుంచి అనుమతిస్తారు. ఈ సమయంలో సాధారణ వాహనదారులకు ఈద్గా వైపు అనుమతించరు. ఈ వాహనాలను దానమ్మ ఎక్స్‌రోడ్స్ నుంచి శాస్త్రీపురం, ఎన్ఎస్ కుంట వైపు డైవర్ట్ చేస్తారు. ఇటుగా వచ్చే వాహనాలు మోడ్రన్ సామిల్ పార్కింగ్ పక్కన, ఇద్గా మైదాన్‌కు ఎదురుగా మెయిన్ రోడ్డుపై, మీరాలం ఫిల్టర్ బెడ్, మీరాలం ఫిల్టర్ బెడ్‌కు పక్కన ఉన్న ఖాళీ స్థలం, దానికి ఎదురుగా ఉన్న సుఫీ కార్స్, యాదవ్ పార్కింగ్(కార్లు) వద్ద పార్కింగ్ చేసుకోవాలి.కాలాపత్తార్ వైపు నుంచి ఈద్గాకు వెళ్లే వెహికల్స్.. కాలాపత్తార్ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. సాధారణ వాహనాలు పీఎస్ వద్ద నుంచి మోచీ కాలనీ, బహదూర్‌పురా, శంషీర్‌గంజ్, ఎన్‌కే కుంట వైపు టర్న్ తీసుకోవాలి. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు పురానాపూల్ నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర భారీ వాహనాలను పురానాపూల్ దర్వాజ నుంచి జియాగూడ, సిటీ కాలేజ్ వైపు డైవర్ట్ చేస్తారు.శంషాబాద్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి నుంచి బహదూర్‌పుర వైపు వెళ్లే భారీ వాహనాలను అరాంఘర్ చౌరస్తా వద్ద ఆయా రూట్లలో డైవర్ట్ చేస్తారు.హాకీగ్రౌండ్, మాసబ్ ట్యాంక్ వద్ద జరిగే ప్రార్థనలను మాసబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్ వరకు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఫ్లై ఓవర్ కింద నుంచి వాహనాలను అనుమతించరు. మెహిదీపట్నం, లక్డీకాపూల్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఫ్లై ఓవర్ పైనుంచి మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.మెహదీపట్నం నుంచి రోడ్డు నం.1 బంజారాహిల్స్‌కు వచ్చే వాహనాలను మాసబ్‌ట్యాంక్ మీదుగా అనుమతించరు. ఈ వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా అయోధ్య జంక్షన్, ఖైరతాబాద్, తాజ్‌కృష్ణ రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది.లక్డీకాపూల్ నుంచి మాసబ్‌ట్యాంక్ మీదుగా 1/12 జంక్షన్ వైపు వెళ్లే వాహనాలను అయోధ్య జంక్షన్ వద్ద ఖైరతాబాద్ వైపు డైవర్ట్ చేస్తారు.బంజారాహిల్స్ రోడ్డు నం.12, పంజాగుట్ట నుంచి మాసబ్‌ట్యాంక్ వైపు వాహనాలను పర్మిషన్ ఉండదు. అటుగా వెళ్లే వాహనాలను తాజ్ కృష్ణ మీదుగా ఖైరతాబాద్ వైపు మళ్లిస్తారు. వాహనదారులు డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని పోలీసు కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసరమైతే 9010203626 ట్రాఫిక్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు.




# కన్నుల పండువగా మల్లన్న రథోత్సవం

శ్రీశైలం మన జనప్రగతి ఏప్రిల్ 10:- నంద్యాల జిల్లా భూ మండలానికి నాభి స్థానంగా విరాజిల్లుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. అశేష జన వాహిని మధ్య భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. శ్రీ స్వామి అమ్మవార్ల రథోత్సవం కన్నులారా చూసేందుకు వేలాది మంది కన్నడ భక్తులు శ్రీ గిరులు తరలి వచ్చారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివ నామస్మరణతో శ్రీశైల పురవీధులు మారుమ్రోగాయి.కన్నుల పండువగా మల్లన్న రథోత్సవం పాల్గొన్న ఆలయ ఈవో పెద్దిరాజు దంపతులు, జగద్గురు పీఠాధిపతి 1008 చెన్న సిద్దరామ శివచార్య స్వామిజీనంద్యాల జిల్లా భూ మండలానికి నాభి స్థానంగా విరాజిల్లుతున్న శ్రీశైలం మహాక్షేత్రంలో ఉగాది సంబరాలు అంబరాన్నంటాయి. అశేష జన వాహిని మధ్య భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. శ్రీ స్వామి అమ్మవార్ల రథోత్సవం కన్నులారా చూసేందుకు వేలాది మంది కన్నడ భక్తులు శ్రీ గిరులు తరలి వచ్చారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివ నామస్మరణతో శ్రీశైల పురవీధులు మారుమ్రోగాయి. ఓంకార నాదంతో ఓం నమఃశివాయ అంటూ రథోత్సవం ముందు భక్తి పరవశంతో కన్నడ భక్తులు పులకించి పోయారు. ముందుగా శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పల్లకిలో వైభవంగా గంగాధర మండపం వద్ద ఉన్న రధశాల వద్దకు తరలిరాగా ఉత్సవమూర్తులకు అర్చకులు వేదపండితులు ప్రత్యేక హారతులిచ్చారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లు రథోత్సవానికి సిద్ధమయ్యారు. అశేష జనవాహిని మధ్య రథోత్సవం కదలగానే వేలాదిమంది కన్నడ భక్తులు ఓం నమః శివాయ అంటూ నినాదించటంతో శ్రీశైల క్షేత్రం పులకించి పోయింది. అనాదిగా వస్తున్న ఆచారం ఖర్జూరాలు,అరటిపండ్లను రధంపైకి విసిరి భక్తులు కరతాళ ధ్వనులతో సంబరాలు జరుపుకున్నారు. ఈ రథోత్సవం కార్యక్రమంలో ఆలయ ఈవో పెద్దిరాజు దంపతులు, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి 1008 చెన్నసిద్దరామ శివచార్య స్వామి సహా భారీ సంఖ్యలో కన్నడ భక్తులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌లోకి ఆమంచి కృష్ణమోహన్

చీరాల మన జనప్రగతి ఏప్రిల్ 10:-ఏపీలో ఎన్నికల వేళ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. అటు పలు నియోజకవర్గాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక పార్టీ నుంచి సీటు ఆశించి భంగపడ్డ నేతలు మరో పార్టీలో టిక్కెట్లు వెతుక్కుంటున్నారు. దాంతో ఎవరు ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే బాపట్ల జిల్లా చీరాలలో వైసీపీ నుంచి టిక్కెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు చాన్స్ దక్కకపోవడంతో కొద్దిరోజుల క్రితం ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. తాజాగా బాపట్ల జిల్లా వేటపాలెం మండలం పందిళ్ళపల్లిలో అనుచరులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సేకరించారు ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ నుంచి చీరాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని అనుచరులు సూచించినట్లు చెప్పారు అందుకే  కాంగ్రెస్‌లో చేరి చీరాల నుంచి పోటీ చేయబోతున్నానని   ప్రకటించారు వైసీపీకి, టీడీపీకి సమాన దూరం పాటించాలని డిసైడ్ అయ్యానన్నారు. వైసీపీ, టీడీపీతో తనకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని.. టీడీపీలో చంద్రబాబు, వైసీపీలో వైఎస్ జగన్ ఎంతో గౌరవించారని తెలిపారు. త్వరలోనే ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను చీరాల బహిరంగ సభకు ఆహ్వానించి కాంగ్రెస్‌లో చేరుతానని స్పష్టం చేశారు ఆమంచి కృష్ణమోహన్. గత ఎన్నికల్లో చీరాల నుంచి వైసీపీ తరఫున పోటీ చేసిన ఆమంచి కృష్ణమోహన్.. టీడీపీ అభ్యర్థి కరణం బలరాం చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత బలరాం వైసీపీలోకి చేరడంతో ఆమంచిని పర్చూరు ఇన్‌చార్జ్‌గా నియమించారు. అయితే.. పర్చూరు నుంచి పోటీకి ససేమీరా అనడంతో అక్కడ వేరే అభ్యర్థిని ప్రకటించింది



# కుప్పకూలిన వాటర్ ట్యాంక్

వరంగల్ మన జనప్రగతి ఏప్రిల్ 10:- వరంగల్ బస్ స్టాండ్ ఆవరణలో వాటర్ ట్యాంక్ కుప్పకూలింది. 55 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆ వాటర్ ట్యాంక్ తొలగింపు సందర్భంగా కనీస జాగ్రత్తలు పాటించక పోవడంతో ట్యాంక్ శిధిలాల కింద చిక్కుకొని ఓ కూలీ ప్రాణాలు కోల్పోయాడు. వరంగల్ బస్టాండ్ ఆధునీకరణ పనుల్లో భాగంగా శిధిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ తొలగిస్తున్నారు. వాటర్ ట్యాంక్ కూల్చివేత సందర్భంగా కింద పిల్లర్లను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న అధికారులు కనీస జాగ్రత్తలు పాటించలేదు. ట్యాంక్ కింద పిల్లర్లను కూలీలు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో ట్యాంక్ ఒక్క సారిగా కుప్ప కూలింది.ఈ ప్రమాదంలో వాటర్ ట్యాంక్ శిధిలాల కింద చిక్కుకున్న రవి అనే కూలీ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు ఖానాపూర్ మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఉపాధి కోసం వచ్చి గరీబ్ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. కూలీ పనికోసం వచ్చి పండుగ పూట ప్రాణాలు కోల్పోయాడు. డెడ్ బాడీని ఎంజీఎం మార్చురీకి తరలించారు.. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్షమే ఈ ప్రమాదానికి కారణం అని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
11 -04-2024

# పిఠాపురం బరిలో తమన్నా సింహాద్రి

పిఠాపురం మన జనప్రగతి ఏప్రిల్ 10:- పిఠాపురం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది పవన్‌కళ్యాణ్‌పై బిగ్‌బాస్ ఫేమ్ తమన్నాసింహాద్రి పోటీ చేస్తుండడం ఆసక్తి రేపుతోంది. 2019 ఎన్నికల్లోనూ ఆమె మంగళగిరి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. అప్పుడు నారా లోకేశ్ పోటీగా రంగంలోకి దిగగా 100 లోపే ఓట్లు పడ్డాయి.ఎన్నికల వేళ ఏపీ పాలిటిక్స్ హాట్‌హాట్‌గా మారాయి. అందులోనూ ముఖ్య నేతలు పోటీ చేస్తున్న స్థానాల్లో హీట్ తారాస్థాయికి చేరుతోంది. ఈ క్రమంలోనే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం పేరు మారుమోగిపోతోంది అయితే ఇప్పుడు ఆ సౌండ్ మరింత పెరగనుంది. పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ పై బిగ్ బాస్ ఫేమ్ తమన్నా సింహాద్రి పోటీకి దిగుతుండటమే అందుకు కారణం. ఇప్పటికే పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌పై వైసీపీ నుంచి మహిళా నేతను బరిలోకి దింపగా తాజాగా బిగ్ బాస్ ఫేమ్ తమన్నా సింహాద్రి పోటీ చేయబోతున్నారు. బోడె రామచంద్రయాదవ్ స్థాపించిన భారత చైతన్య యువజన పార్టీ తరపున బరిలోకి దిగుతున్నారు ఆ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ప్రకటించిన 38 మంది జాబితాలో తమన్నా సింహాద్రి పేరు ఉండడం ఆసక్తి రేపుతోంది.




# వాలంటీర్లు ఎవరూ రాజీనామా చేయవద్దు
## జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి మన జనప్రగతి ఏప్రిల్ 10:-
ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు వాలంటీర్ల ప్రస్తావన లేకుండా సాగడం లేదు ఎన్నికల విధుల్లో, ప్రచారాల్లో వాలంటీర్లు పాల్గొన కూడదంటూ ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన తర్వాత మూకుమ్మడిగా వివిధ ప్రాంతాల్లో తమ పదవులకు రాజీనామా చేస్తూ వస్తున్నారు వాలంటీర్లు అయితే, వాలంటీర్స్ ఎవరూ రాజీనామా చేయవద్దు అని విజ్ఞప్తి చేశారు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మా ప్రభుత్వం (తెలుగుదేశం పార్టీ సర్కార్ ) మీకు అండగా ఉంటుందని వెల్లడించారు. మీ సహకారంతో తాడిపత్రి మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేస్తాం అన్నారు. ఇక, గత ఐదు సంవత్సరాలలో తాడిపత్రి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందన్నారు. మంచి పరిపాలన అందించడానికి మీ సేవలు వినియోగించు కుంటామని స్పష్టం చేశారు జేసీ ప్రభాకర్ రెడ్డి. కాగా, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు..



వాలంటీచర్లకు గుడ్‌న్యూస్ చెప్పిన విషయం విదితమే.. వాలంటీర్ల వ్యవస్థే లేదంట అనే వార్త బయటకు వచ్చింది వాలంటీర్ల వ్యవస?ను రద్దు చేస్తూ రహస్య జీవో ఏమైనా తెచ్చారా అని ప్రశ్నించిన ఆయన వాలంటీర్ల వ్యవస్థపై తొలి సంతకం అంటే ఇప్పుడు వాలంటీర్ల వ్యవస? లేనట్టేగా..? అని పేర్కొన్నారు. సీఎం జగన్ వాలంటీర్లను మోసం చేస్తున్నారు జగన్ ఎంత స్వార్ధపరుడో వాలంటీర్లు అర్థం చేసుకోవాలి అని ఆయన పేర్కొన్నారు. కానీ, మేం వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తాం వారికి 10 వేల రూపాయల గౌరవ భృతిని కల్పిస్తాం అని చంద్రబాబు వెల్లడించారు ఇక, వాలంటీర్లల్లో చదువుకున్న వారికి అద్భుతమైన ఉపాధి కల్పిస్తాం అని హామీ ఇచ్చారు%ఎ%తప్పుడు పనులు చేసిన వాలంటీర్లు జైలుకు వెళ్లొద్దు రాష్ట్ర ప్రగతితో వాలంటీర్లు భాగస్వామి కావాలి అంటూ చంద్రబాబు పిలుపునిచ్చిన విషయం విదితమే.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

### ఏకంగా మహిళా న్యాయవాదికే వేధింపులు.. రూ.15లక్షలు నిలువు దోపిడీ

బెంగుళూరు మన జనప్రగతి ఏప్రిల్ 10:-
బెంగుళూరు లో జరిగిన ఘరానా మోసం ఒకటి సంచలనం రేపుతోంది. ఏకంగా ఓ మహిళా న్యాయవాదిని టార్గెట్‌గా బాధితురాలిని చేశారు. సైబర్ నేరగాళ్లు మహిళను డబ్బు మోసం చేయడమే కాకుండా కెమెరా ముందు ఆమెను బట్టలు విప్పమని బలవంతం చేశారు. 36 గంటల పాటు దుండగులు మహిళా న్యాయవాదిపై పలు రకాల వేధింపులకు పాల్పడినట్టుగా తెలిసింది. కస్టమ్స్ అధికారుల ముసుగులో మహిళ న్యాయవాదికి వీడియో కాల్ చేసిన మోసగాళ్లు మహిళను బట్టలు విప్పమని బలవంతం చేయడమే కాకుండా.. వీడియో రికార్డు చేసి బ్లాక్ మెయిల్ చేశారు. ఆ వీడియోతో బెదిరింపులకు పాల్పడ్డారు. ఆమెను బెదిరించిన దుండగులు లక్షల దోచుకున్నారు. ఎట్టకేలకు ఆలస్యంగా విషయం అర్థం చేసుకున్న బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. ఫెడెక్స్ ఇంటర్నేషనల్ కొరియర్ కంపెనీకి చెందిన వ్యక్తినని చెబుతూ బెంగళూరుకు చెందిన 29 ఏళ్ల యువతికి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఏప్రిల్ 3న మహిళా లాయర్‌కు కాల్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తి తాను ముంబై పోలీస్‌గా నమ్మించాడు.. థాయిలాండ్ నుండి తన పేరు మీద 140 గ్రాముల డ్రగ్స్ ఉన్న పార్శిల్ వచ్చిందని చెప్పాడు. 5 పాస్‌పోర్టులు, 3 క్రెడిట్ కార్డులు ఉన్నాయని చెప్పాడు. నార్కోటిక్స్ టెస్టు పేరిట వీడియో కాల్‌లో ఆమెతో అసభ్యంగా బట్టలు తొలగించాలని డిమాండ్ చేసి వీడియో రికార్డు చేశారు. ఆ తర్వాత వీడియోను బహిర్గతం చేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టారు. సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. అడిగినంత ఇవ్వకపోతే వీడియోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బెదిరిపోయిన సదరు మహిళ న్యాయవాది చేసేదేమీ లేక నిందితుల డిమాండ్‌కు తలొగ్గింది. వారు కోరినట్టు నగదును ఆన్‌లైన్‌లో వారు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేసింది. ఆ తర్వాత ఏప్రిల్ 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు



# వైసీపీలోకి కీలక నేతలు

### కండువా కప్పి ఆహ్వానించిన సీఎం జగన్

విజయవాడ మన జనప్రగతి ఏప్రిల్ 10:- పల్నాడు జిల్లా మేమంతా సిద్ధం బస్సుయాత్రలో పలువురు కీలక నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు పల్నాడు జిల్లా గంటావారిపాలెం నైట్ స్టే పాయింట్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు బుధవారం పి.గన్నవరంకు చెందిన జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాయచోటి తెలుగుదేశం పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి, విజయవాడ వెస్ట్ జనసేన పార్టీ నియోజక ఇంచార్జ్ పోతిన మహేష్.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. వారితో పాటు పలువురు నేతలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.. అందరికీ వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి. జనసేన టికెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పోతిన మహేష్ జనసేన పార్టీకి రాజీనామా చేసిన విషయం విదితమే ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఆయన సంచలన ఆరోపణలు సైతం చేశారు.. రాజీనామా చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన సింహంలా సింగిల్‌గా వచ్చే దమ్మున్న నాయకుడితోనే తన పయనం ఉంటుందని మాట తప్పని మడమతిప్పని నేతతో రాజకీయ ప్రయాణం చేయాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్న విషయం విదితమే కాగా అనుచరులతో కలిసి సీఎం జగన్ క్యాంప్ సైట్ వరకు పోతిన మహేష్ ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా గంటావారిపాలెంలో జగన్ క్యాంప్ సైట్‌కి ర్యాలీగా వెళ్లి.. జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు పోతిన మహేష్ సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి.. 2004, 2009 ఎన్నికల్లో పి గన్నవరం ఎమ్మెల్యేగా పనిచేశారు పాముల రాజేశ్వరి 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు కొద్దికాలంగా జనసేన పార్టీకి దూరంగా ఉంటున్నారు అయితే, పాములు రాజేశ్వరిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వద్దకు తీసుకెళ్లారు అమలాపురం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాద్ ఇక, వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు సీఎం జగన్.మరోవైపు, అన్నమయ్య జిల్లా రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి టీడీపీకి రాజీనామా చేసిన విషయం విదితమే టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని వెల్లడించిన ఆయన ప్రజలకు సేవ చేసే పార్టీలా టీడీపీ పనిచేయడం లేదన్నారు. డబ్బులు తీసుకుని టికెట్లు అమ్ముకోవడం దారుణం అన్నారు. పార్టీ అభివృద్ధికి పని చేసిన వారికి టీడీపీలో గుర్తింపు లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని సంప్రదించకుండా టికెట్లు కేటాయించడం దుర్మార్గం అన్నారు. తమ బాధలు.. జరుగుతోన్న అన్యాయాన్ని చెప్పుకోవడానికి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అపాయింట్‌మెంట్ సైతం దొరకని పరిస్థితి టీడీపీలో ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు.. ఇక, ఈ రోజు సీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్ రెడ్డి.



# పిడకల సమరం

కర్నూలు మన జనప్రగతి ఏప్రిల్ 10:-
ప్రేమికులను విడదీసిన పెద్దలను చూసుంటాం, ప్రేమ కథలు విషాదాంతంగా ముగిసిన సందర్భాలనూ విని ఉంటాం కానీ, ప్రేమను గెలిపించే పోరాటం పిడకల సమరం మాత్రం మనకు అరుదుగా కనిపిస్తూ ఉంటుంది దానికి మన ఆంధ్రప్రదేశ్ వందల ఏళ్ల క్రితమే వేదికగా మారింది చరిత్రలో నిలిచిపోయింది పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్నూలు జిల్లా ఆస్పరి మండలం కైరుప్పాల గ్రామంలో శ్రీ భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ఆలయానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఉగాది మరుసటి రోజు ఇక్కడ జరిగే పిడకల సమరం వెనుక కూడా ఇంట్రస్టింగ్ స్టోరీ ప్రచారంలో ఉంది. త్రేతాయుగంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ప్రేమికులని ఆలయ చరిత్ర చెబుతోంది. వారి మధ్య ప్రేమ వ్యవహారం కాస్త గొడవకు దారితీస్తుంది. పెళ్లి విషయంలో కొంత ఆలస్యం చేస్తారు వీరభద్రస్వామి ప్రేమించి పెళ్లి చేసుకోకుండా తమ భద్రకాళి దేవిని వీరభద్ర స్వామి మోసం చేసారని అమ్మ వారి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారట.అయితే, వీరభద్ర స్వామిని పేడతో తయారు చేసిన పిడకలతో కొట్టి అవమానించాలని చూస్తారు. దీనిని తెలుసుకొన్న వీరభద్ర స్వామి భక్తులు అమ్మవారు ఉండే ఆలయం వైపు వీరభద్ర స్వామిని వెళ్లవద్దని వేడుకొంటారు. కానీ, స్వామి భక్తులు చెప్పిన మాటలు వినకుండా అమ్మవారి ఆలయం వైపు వెళ్తారు అప్పుడు అమ్మవారి భక్తులు ముందుగా వేసుకోన్న ప్రణాళికలో భాగంగా వీరభద్ర స్వామిపై పేడతో తయారు చేసిన పిడకలు విసురుతారు ఇక, విషయం తెలుసుకున్న స్వామి వారి భక్తులు కూడా ప్రతిగా పిడకలతో అక్కడికి వెళ్తారు అమ్మవారి భక్తులపై ఎదురుదాడికి దిగుతారు. అలా ఇరువర్గాలు పిడకల సమరం సాగిస్తారు. బ్రాహ్మదేవునికి వారి మధ్య జరుగుతున్న పిడకల సమరం విషయాన్ని విశ్వకర్మ (భద్రకాళి అమ్మ వారి) తండ్రి చెబుతారు. బ్రహ్మ దేవుడు వీరభద్ర స్వామి తండ్రి శివుడు దృష్టికి తీసుకుని వెళ్లడంతో అనంతరం బ్రహ్మ దేవుడు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను శాంతింపజేశారని చెబుతారు.పిడకల సమరంలో దెబ్బలు తగిలిన వారు భద్రకాళి అమ్మవారు వీరభద్ర స్వామి వార్ల ఆలయాలకు వెళ్లి నమస్కారం చేసుకొని అక్కడ ఆయా ఆలయాల్లో ఉన్న వీభూతిని ఇరువర్గాల భక్తులు రాసుకుని రావాలని బ్రహ్మ ఆదేశిస్తాడు ఆ తర్వాత ఒకే ఆలయంలో ఇద్దరు విగ్రహాలను ఏర్పాటు చేసి వారికి కల్యాణం జరిపిస్తామని బ్రహ్మ దేవుడు మాట ఇచ్చినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది స్వామి వార్లకు అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే వారు పిడకల సమరం జరిగే కొన్ని నిమిషాలకు ముందు ప్రత్యేక పూజలు నిర్వహించేలా చూడాలని కూడా బ్రహ్మ దేవుడు భక్తులను కోరాడట అందుకు సమ్మతించిన భక్తులు బ్రహ్మ దేవుడ్ని కైరుప్పల గ్రామం పక్కన ఉన్న కారుమంచి గ్రామంలో ఉన్న ఒక రెడ్ల కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించేలా అవకాశం ఇవ్వాలని కోరినట్లు చెబుతారు,
అలా ప్రతి ఏటా ఉగాది ఉత్సవాలలో భాగంగా స్వామి వార్ల పిడకల సమరం జరిగే కొన్ని నిమిషాలకు ముందు కారుమంచి గ్రామం నుంచి ఒక రెడ్డి కుటుంబ సభ్యులు ఆచారం ప్రకారం గుర్రంపై కైరుప్పల గ్రామానికి ఊరేగింపుగా చేరుకొంటారు. ప్రత్యేక పూజలు చేస్తారు. వారి ప్రత్యేక పూజలు నిర్వహించిన కొన్ని నిమిషాల తర్వాత గ్రామస్థులు ఇరువర్గాలగా విడిపోయి పిడకలతో కొట్టుకొంటారు. ఇలా కొట్టుకోవడం ఒక సంప్రదాయం అని భక్తులు అంటున్నారు. పిడకల సమరంలో దెబ్బలతగిలిన వారు ఆలయానికి వెళ్లి స్వామి వార్లకు నమస్కారం చేసుకొంటారు. అక్కడ ఉన్న వీభూతిని దెబ్బలు తగిలిన చోట వేసుకొని ఇళ్ళకు వెళ్ళిపోతారు. ఈ సంప్రదాయ క్రీడను కొన్ని తరాలుగా గ్రామస్థులు జరుపుకోవడం విశేషం. దీన్ని చూడటానికి వేలాదిగా జనం తరలివస్తారు. పిడకల సమరం ముగిసిన మరసటి రోజు శ్రీ భద్రకాళి అమ్మవారికి, వీరభద్ర స్వామి వారికి అంగరంగ వైభవంగా కళ్యాణం జరిపిస్తారు.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
11 -04-2024

# బంజారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ

ఉరవకొండ మన జనప్రగతి ఏప్రిల్ 10:- ప్రస్తుత కాలంలో వాతావరణంలో మార్పులు, భూతాపం పెరగటం, అనావృష్టి, జీవకోటి మనుగడకు మూలాధారమైన అడవుల తరుగుదల వల్ల సమస్త జీవకోటి మనుగడకు ముప్పు పొంచివుందని బంజారా ఫౌండేషన్ ఛైర్మన్ కమల్ సింగ్ రాథోడ్ తెలిపారు. మానవ మనుగడకు కీలకమైన పంచభూతాలు స్వేచ్ఛగా దొరకలేని పరిస్థితులు ఏర్పాటుకు కారణం మానవుని అతి వినియోగం, అవసరాన్ని మించి ప్రకృతిని నాశనం చేయడంమే ముఖ్య కారణం అని పెర్కొన్నారు.



మునుముందు తరానికి మానవ మనుగడకు గాలి నీరు నిప్పు ఖర్చుతో కూడుకున్న సహజ వనరులుగా ఏర్పడుతున్నాయి అని తెలిపారు ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కాలుష్య కారకాలు పెరగటం వల్ల ఆక్సిజన్ శాతం తగ్గడంతో ఎక్కడి ప్రజలు ఆక్సిజన్ సిలెండర్లలో గాలిని తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి అని విచారాన్ని వ్యక్తం చేశారు. మానవ మనుగడకు మూలాధారమైన అడవుల పెంపకం, నీటి వృధాను అరికట్టడం వాటి విలువలను నూతన సమాజాన్ని ఉత్తేజితం చేయడమే ముఖ్య ఉద్యేశం అని తెలిపారు

# ఘనంగా కొత్తరాయుడు స్వామి కళ్యాణం

యాడికిమన జనప్రగతి ఏప్రిల్ 10:- యాడికి మండలం కమలపాడు పంచాయతీలో కొత్త రాయుడు స్వామికి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది దాదాపుగా 5000 మంది భక్తులు పాల్గొన్నారు భక్తులందరికీ గంగవరం ఫ్యామిలీ ఆధ్వర్యంలో లైటింగ్ షేమియాణాలు కళ్యాణం గుడికి పెయింటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు రవ్వ ఫ్యామిలీ ఆధ్వర్యంలో రాత్రి భోజనాలు ఉదయం అల్పాహార విందు, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు ,వాగ్దేవి స్కూల్ , విజన్ స్కూల్ వారి ఆధ్వర్యంలో



ఉచిత రవాణా యాడికి నుండి కొత్త రాయుడు స్వామికి ఉచిత ప్రయాణం ఏర్పాటు చేశారు పెన్నా సిమెంట్ వారి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రము వైద్య శిబిరము సెక్యూరిటీ కార్యక్రమాలు మరి కొంతమంది భక్తులు పానకము మజ్జిగ వసతులు కల్పించారు ఈ కార్యక్రమాలన్నీ చాలా దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవ్వా మోహన్ పుల్లయ్య, రవ్వా బాల పుల్లయ్య, రవ్వా శ్రీహరి, గంగవరం చంద్రయ్య, ఆదిత్య ఆదిత్య మందుల షాపు పవన్, గంగవరం శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# పార్కింగ్ ప్లేస్ గా మారిన ప్రభుత్వ కార్యాలయాలు.

పత్తికొండ మన జనప్రగతి ఏప్రిల్ 10:- ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారుల వాహనాలు పెట్టేందుకు నానా అవస్థలు పడాల్సివస్తుంది. ఉన్న స్థలాల్లో ప్రభుత్వ అధికారుల వాహనాలు కాకుండా బయట వ్యక్తులు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. రెండు మూడు రోజులైనా కార్యాలయం వద్ద వాహనాలు పెట్టిపోతే ఎవరు ముట్టారని ధీమా కాబోలు. అందుకే ప్రైవేట్ వ్యక్తులు తమ సొంత వాహనాలను ప్రభుత్వ కార్యాల వద్ద నీడకు పార్కింగ్ చేసి వెళ్ళిపోతున్నారు. అధికారులు ఇక్కడ వాహనాలు పెట్టరాదని ఎన్నిసార్లు చెప్పిన వాహనదారులు మార్పు రావడం లేదు. ఒకరిని చూసి మరొకరు వాహనాలు పార్కింగ్ చేసి వెళు తుండడంతో ప్రభుత్వ అధికారుల వాహనాలు ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.



# ఘనంగా దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలు

వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 10:- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దంతలూరు కృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.బుధవారం ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతంలో వైఎస్సార్సీపీ నాయకుడు దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు భారీ కేక్ కటింగ్ చేశారు.అనంతరం ఒకరినొకరు కేక్ తినుపించుకుని సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి (దిల్మాంగే) మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు దంతలూరు కృష్ణ పుట్టిన రోజు వేడుకలను




కార్యకర్తలు,అభిమానుల మధ్య నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు.అలాగే సాయం అడిగిన వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసే ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు.ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి భారతీ,వార్డు సభ్యుడు ముత్యాల ఆంజనేయులు,వైఎస్సార్సీపీ నాయకులు రామశేఖర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి,అశోక్,లోకేష్ తదితర కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రాతి దూలం లాగుడు పోటీలు


బొమ్మనహాళ్ మన జనప్రగతి ఏప్రిల్ 10 :- బొమ్మనహాళ్ మండల పరిధిలోని దేవగిరి గ్రామంలోని గ్రామ సర్పంచ్ ఎం.సి.హెచ్,రాధిక,మండల సీనియర్ నాయకుడు ఎం.సి.హెచ్, రాజకుమార్,వారి ఆధ్వర్యంలో ఉగాది పండుగ శుభ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలలో ఘనంగా నిర్వహించారు.ఇక పోటీలలో భాగంగా మొత్తం 08 జతలు రాతిదూలం లాగుడు పోటీలలో వృషభములు పాల్గొన్నాయి.ఈ రాతి దూలం లాగుడు పోటీలను రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు, పోటీలలో పాల్గొన్న,ఎద్దులు మొదటి బహుమతిగా రామయ్య,ఎద్దులు మొదటి స్థానం 5000 రూ. మరి ఒక్క ట్రోపిని,సర్పంచ్ ఎం.సి.హెచ్, రాధిక,సీనియర్ నాయకుడు రాజకుమార్,వారు బహుమతి అందజేశారు,రెండో బహుమతిగా రాంబాబు వారి ఎద్దులు రెండవ బహుమతి 3000,ఎంపిటిసి హనుమేష్ వారు ప్రధానం చేశారు, మూడో బహుమతి శ్రీకాంత్ వారి ఎద్దులు 2000,నగదును,రుద్ర వారు బహుమతి ప్రధానం చేశారు,ఈ యొక్క రాతిదూలం పోటీలలో భాగంగా అదే గ్రామంలో ఉన్న



ఎద్దులు పెద్ద ఎత్తున పాల్గొని బహుమతులు దక్కించుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా ఉగాది పండుగ సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలు అంగరంగ వైభవంగా మొదలయ్యి, మెట్టు విశ్వనాథ్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు, గ్రామస్తులందరూ ఏకమై సుఖసంతోషాలతో ఆనందంగా పండుగ జరుపుకుంటూ యధావిధిగా రాతిదూలం లాగుడు పోటీలు జరగాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏం.సి.హెచ్,రాధిక,మండల సీనియర్ నాయకుడు ఎం.సి.హెచ్, రాజకుమార్,ఎంపిటిసి హనుమేష్, నాయకులు,రుద్ర,పలు వార్డు మెంబర్లు.బూత్ కన్వీనర్లు.మరియు నాయకులు,అభిమాన కార్యకర్తలు పెద్ద ఎత్తున.ప్రజలు పాల్గొన్నారు.

# నేడు పలు గ్రామాలలో "ఇంటి ఇంటింటికి మెట్టు కార్యక్రమం

బొమ్మనహాళ్ మన జనప్రగతి ఏప్రిల్ 10 :- కనేకల్ మండలం పరిధిలో నాగేపల్లి, తుంబిగనూరు,ఎన్.హనుమాపురం,గ్రామాలలో,ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి,వారు"ఇంటింటా మెట్టు"కార్యక్రమం భాగంగా పర్యటించనున్నారు,కావున వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాన నాయకులు కార్యకర్తలు.ప్రజా ప్రతినిధులు,అందరు పెద్ద అందరు పెద్ద ఎత్తున పాల్గొని రానన్న ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా,పెద్ద ఎత్తున పాల్గొనాలని,కనేకల్ మండల టౌన్ కన్వీనర్ టి.కేశవరెడ్డి తెలిపారు. కావున మండలంలో వై.యస్.ఆర్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, జెడ్పిటిసి,ఎంపీపీలు,వైస్ ఎంపీపీలు ఎంపీటీసీ,సర్పంచులు.వైస్ సర్పంచులు,సచివాలయం కన్వీనర్లు,గృహ రథసారతులు,వార్డ్ మెంబర్లు.జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్లు,వివిధ అనుబంధ



విభాగాల కమిటీ మెంబర్లు.వైసిపి నాయకులు.కార్యకర్తలు. అభిమానులు.అందరూ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కనేకల్ మండల టౌన్ కన్వీనర్ టి. కేశవరెడ్డి కోరుతున్నారు.

# వైకాపా కు ఓటమి భయం పట్టుకుంది

## ఫక్ న్యూస్ తో దుష్ప్రచారం సిగ్గుచేటు
## టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్

వేంపల్లె మన జనప్రగతి ఏప్రిల్ 10 :- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటమి పట్టుకుందని,అందుకు ఫేక్ న్యూస్ ల ద్వారా దుష్ప్రచారానికి పాల్పడుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మహమ్మద్ షబ్బీర్ ధ్వజమెత్తారు.బుధవారం స్థానిక ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లింల 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఫోటో తో ఒక ఫేక్ న్యూస్ సృష్టించి రాష్ట్ర వ్యాప్తంగా దుష్ప్రచారం చేస్తోందన్నారు.వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఓటమి ఖాయమని తెలిసి ఇలాంటి వాటికి పాల్పడ్డడం సిగ్గు చేటన్నారు.టిడిపి నుంచి ముస్లింలకు దూరం చేసేందుకు పన్నాగమన్నారు.కానీ ఎప్పటికీ అలా జరగదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముస్లింలపై దాడులు,మైనార్టీ సంక్షేమ కార్యక్రమాల రద్దు,వక్ఫ్ ఆస్తుల కబ్జాలు వైకాపా హయాంలో జరిగాయన్నారు.మైనార్టీలకు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసింది టిడిపి ప్రభుత్వం మాత్రమేనన్నారు.రంజాన్ తోఫా,ఇమామ్,మౌజన్ లకు



గౌరవవేతనం,మసీదు మరమ్మతుల కోసం నిధులు,శ్మశాన ప్రహరీ గోడలు,షాదిఖాన నిర్మాణం,విదేశీ విద్యకు రూ.15 లక్షలు సబ్సిడీ రుణాలు,లాంటి అనేక కార్యక్రమాలు టిడిపి ప్రభుత్వం చేపట్టిందన్నారు.వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక ముస్లిం సోదరులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు.మైనారిటీల పేరుతో తప్పుడు వార్తలు ప్రసారం చేస్తే ఒరిగేదేమి లేదన్నారు.రానున్న ఎన్నికల్లో వైకాపాను ఓడించి గద్దె దించేందుకు మైనారిటీలు సిద్ధంగా ఉన్నారన్నారు.ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి అల్లాబకష్, మహమ్మద్,ఇలియాస్,షరీఫ్,పీరా,ఫయాజ్ తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# ముమ్మరమైన పోలీస్ తనిఖీల

## పట్టుబడ్డ 37 లక్షల రూపాయలు




ఆదోనీ మన జనప్రగతి ఏప్రిల్ 10:- రానున్న ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న విస్తృత తనిఖీల్లో భాగంగా నగదు, విలువైన వస్తువులు పట్టుబడుతున్నాయి. ప్రజలు రవాణా సమయంలో డబ్బు కానీ, నగలు కానీ తీసుకు వెళుతుంటే తప్పకుండా వాటికి సంబంధిత బిల్లుల వివరాలు చూపాల్సి ఉంటుంది అని ఆదోని డిఎస్పి శివ నారాయణ స్వామి తెలిపారు. బుధవారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఉదయం భారీగా నగదు పట్టుకున్న మని తేలియ జేశారు. పట్టణంలోనీ రైల్వే స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మల్లికార్జున అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న ఒక బ్యాగును సోదా చేయగా సుమారు రూ. 37 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదుపై అధికారులు వివరణ కోరగా సంబంధించిన వ్యక్తి సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ ఇన్కమ్ టాక్స్ అధికారులకు అప్పజెప్పనున్నట్లు డిఎస్పి శివ నారాయణ స్వామి తెలిపారు.

# ఇంటింటికి మెట్టు కార్యక్రమం విజయవంతం చేయండి

కనేకల్ మన జనప్రగతి ఏప్రిల్ 10:-కణేకల్ మండలం నాగేపల్లి, తుమ్మిగనూరు, ఎన్. హనుమాపురం గ్రామంలో "ఇంటింటికి మెట్టు కార్యక్రమం" లో రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడువిశ్వనాథ్ రెడ్డి పాల్గొంటారు విచ్చేయుచున్నారు కావున కనేకల్ మండలం ఎంపీపీ, జడ్పిటిసి సభ్యులు, వైస్ ఎంపీపీలు, మండల సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, మండల కన్వీనర్, టౌన్ కన్వీనర్ లు,గృహ సారథులు మరియు వైఎస్ఆర్సిపి నాయకులు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు మాజీ ప్రజా ప్రతినిధులు అందరూ కలిసికట్టుగా వచ్చి కార్యక్రమం చేయాలని పిలుపునివ్వడం జరిగింది